అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people



## భద్రగిరిపై ఆధ్యాత్మిక శోభ

అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ అర్చకుల వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ భక్తిశ్రద్ధలతో ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి తమ సతీమణితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారితో పాటు వారి అల్లుడు విష్ణువర్ధన్ రెడ్డి కూడా ఈ మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న వారికి అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజల అనంతరం, ఎమ్మెల్యే దంపతులు, విష్ణువర్ధన్ రెడ్డి భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గురువారం 18, జూన్ 2026 | సంపుటి :03 | సంచిక :127 | పేజీలు :05 | వెల ₹5

# ఆధ్యాత్మిక వైభవం

- కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణంలో కీలకఘట్టం
- శృంగేరి జగద్గురువుల ఆశీస్సులతో శాస్త్రోక్తంగా హోమాలు, శాంతి పూజలు
- బాలాలయంలో చిన్న లింగాలు, పంచలోహ కళశాల ప్రాణ ప్రతిష్ఠ నిర్వహణ
- వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ భక్తి పారవశ్యంలో మునిగిన పుణ్యక్షేత్రం

03

ప్రపంచంలోనే అత్యంత అరుదైన పుణ్యక్షేత్రాలలో ఒకటిగా పేరుగాంచిన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానంలో చేపట్టిన పునర్నిర్మాణ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు, హోమాలు, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 5 గంటల నుంచే ఆలయ ప్రాంగణం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలతో మార్మోగింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్. మహేష్ ఆధ్వర్యంలో స్వామివారికి పూలు, పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శృంగేరి జగద్గురువుల ఆశీస్సులతో వచ్చిన శిష్యబృందం, తొమ్మిది మంది వేద పండితుల సమక్షంలో మహా గణపతి పూజతో కార్యక్రమాలను ప్రారంభించింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో పంచబ్రహ్మ హోమం, శాంతి పూజలు, ప్రాయశ్చిత్త హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమాలు ముగిసిన అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, మహామంగళహారతులు నిర్వహించారు.

- అక్షరదర్బార్, కాళేశ్వరం



## పారదర్శకంగా ఏజెన్సీల కేటాయింపు

- విపక్షాల చిల్లరరాతలను నమ్మొద్దు
- కొండా మురళి, సురేఖపై అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకోం
- కొండా అభిమానుల హెచ్చరిక

02





# తీరిన చివరి కోరిక

## 'చోటా గబ్బర్ సింగ్' ఇంట జనసేనాని సందడి



- హనుమకొండలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటన
- మంచానికే పరిమితమైన నిరంజన్‌ను ఓదార్చిన పవన్
- రూ.1 లక్ష ఆర్థిక సాయం.. ఉపాధికి భరోసా.. బండ్ల గణేష్ తరపున రూ.5 లక్షల ప్రకటన
- భద్రకాళి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు.. పోటెత్తిన అభిమాన జనం

02

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ బుధవారం తెలంగాణలోని హనుమకొండ జిల్లాలో పర్యటించారు. అధికారిక బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన హనుమకొండకు రావడం ఇదే మొదటిసారి కావడంతో స్థానిక జనసైనికులు, అభిమానులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ పర్యటనలో పవన్ కళ్యాణ్ తన మానవత్వాన్ని చాటుకోవడంతో పాటు ఆధ్యాత్మిక, రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హనుమకొండలోని హనుమాన్ నగర్ కు చెందిన 17 ఏళ్ల పొనుగోటి నిరంజన్ అనే బాలుడు 'డుషెన్ మస్కులర్ డిస్ట్రోఫీ' (డీఎండీ) అనే అరుదైన జన్యుపరమైన, నరాల వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. తన అభిమాన హీరో పవన్ కళ్యాణ్ ను కలవడమే తన చివరి కోరికంటూ ఆ బాలుడు సోషల్ మీడియా ద్వారా వ్యక్తపరిచిన ఆవేదన జనసేన నేతల ద్వారా పవన్ కళ్యాణ్ దృష్టికి వెళ్లింది. దీనిపై తక్షణమే స్పందించిన ఏపీ డిప్యూటీ సీఎం, నేరుగా నిరంజన్ నివాసానికి చేరుకున్నారు. బాలుడిని ప్రేమగా దగ్గరకు తీసుకుని, సుదీర్ఘంగా ముచ్చటించారు. నిరంజన్ తనను 'చోటా గబ్బర్ సింగ్' అని పిలుస్తారని చెప్పగా పవన్ నవ్వుతూ మురిసిపోయారు. భవిష్యత్తులో తాను తీయబోయే 'ఓజీ 2' సినిమాకు నిరంజన్ ను ప్రత్యేక అతిథిగా ఆహ్వానిస్తానని హామీ ఇచ్చారు. అలాగే బాలుడు కోరుకున్న విధంగా ఒక కుక్క పిల్లను కొని పంపిస్తానని మాట ఇచ్చారు.

- అక్షరదర్బార్, హనుమకొండ



## పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- ఇద్దరు సిబ్బందికి షోకాజ్ నోటీసులు
- పారిశుధ్యంపై ఆగ్రహం.. హెచ్ఎంకు మందలింపు
- ముందస్తు అనుమతి లేకుండా వెళ్తే ఉపేక్షించేది లేదనీ హెచ్చరిక

అక్షరదర్బార్, వరంగల్; వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం వరంగల్ లోని ఇంతేజార్ గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు, నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు, మౌలిక సదుపాయాలను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ తనిఖీ సందర్భంగా పాఠశాల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్, విధి నిర్వహణలో ఉండి కూడా ముందస్తు అనుమతి లేకుండా బయటకు వెళ్లిన ఇద్దరు పాఠశాల సిబ్బందిని గుర్తించారు. విధుల్లో ఇలాంటి నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణించిన జిల్లా కలెక్టర్, సదరు ఇద్దరు సిబ్బందికి తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాల్సిందిగా అక్కడే ఉన్న అదనపు కలెక్టర్ వై.వి. గణేష్‌కు సిఫారసు చేశారు.

అనంతరం పాఠశాల ఆవరణ, తరగతి గదులు, మరుగుదొడ్లను పరిశీలించిన కలెక్టర్, పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బడి ఆవరణ అంతా పరిశుభ్రంగా ఉండేలా చూడాలని హెడ్మాస్టర్‌ను తీవ్రంగా మందలించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు గాను ప్రస్తుత స్కావెంజర్‌ను మార్చాలని ఆమె సూచించారు. పాఠశాల ముందు ప్రవహిస్తున్న మురికి కాలువ తెరిచి ఉండటం గమనించిన కలెక్టర్, ఇది విద్యార్థులకు ఎంతో ప్రమాదకరమని హెచ్చరించారు. వెంటనే స్పందించి ఆ కాలువపై బండలు వేసి మూసివేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యార్థుల హాజరు, పాఠ్యపుస్తకాల పంపిణీ తదితర అంశాలను ఆమె క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. వారికి అందుతున్న సౌకర్యాలు, చదువుల నాణ్యత, మధ్యాహ్న భోజనం రుచిగా వండుతున్నారా లేదా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో పారిశుధ్యం, విద్యార్థుల భద్రత, విద్యా ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరు, మౌలిక సదుపాయాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీలో కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ వైవీ గణేష్, వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# తీరిన చివరి కోరిక

- హనుమకొండలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటన
- మంచానికే పరిమితమైన నిరంజన్‌ను ఓదార్చిన పవన్
- రూ.1 లక్ష ఆర్థిక సాయం.. ఉపాధికి భరోసా.. బండ్ల గణేష్ తరపున రూ.5 లక్షల ప్రకటన
- భద్రకాళి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు.. పోటెత్తిన అభిమాన జనం

## 'చోటా గబ్బర్ సింగ్' ఇంట జనసేనాని సందడి

నిరంజన్ తల్లిదండ్రులు రాము, మానసలతో మాట్లాడి



**అక్షరదర్బార్, హనుమకొండ :**

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ బుధవారం తెలంగాణలోని హనుమకొండ జిల్లాలో పర్యటించారు. అధికారిక బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన హనుమకొండకు రావడం ఇదే మొదటిసారి కావడంతో స్థానిక జనసైనికులు, అభిమానులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ పర్యటనలో పవన్ కళ్యాణ్ తన మానవత్వాన్ని చాటుకోవడంతో పాటు ఆధ్యాత్మిక, రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హనుమకొండలోని హనుమాన్ నగర్‌కు చెందిన 17 ఏళ్ల పొనుగోటి నిరంజన్ అనే బాలుడు 'డుషెన్ మస్కులర్ డిస్ట్రోఫీ' (డీఎండీ) అనే అరుదైన జన్యుపరమైన, నరాల వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. తన అభిమాన హీరో పవన్ కళ్యాణ్‌ను కలవడమే తన చివరి కోరికంటూ ఆ బాలుడు సోషల్ మీడియా ద్వారా వ్యక్తపరిచిన ఆవేదన జనసేన నేతల ద్వారా పవన్ కళ్యాణ్ దృష్టికి వెళ్లింది. దీనిపై తక్షణమే స్పందించిన ఏపీ డిప్యూటీ సీఎం, నేరుగా నిరంజన్ నివాసానికి చేరుకున్నారు. బాలుడిని ప్రేమగా దగ్గరకు తీసుకుని, సుదీర్ఘంగా ముచ్చటించారు. నిరంజన్ తనను 'చోటా గబ్బర్ సింగ్' అని పిలుస్తారని చెప్పగా పవన్ నవ్వుతూ మురిసిపోయారు. భవిష్యత్తులో తాను తీయబోయే 'ఓజీ 2' సినిమాకు నిరంజన్‌ను ప్రత్యేక అతిథిగా ఆహ్వానిస్తానని హామీ ఇచ్చారు. అలాగే బాలుడు కోరుకున్న విధంగా ఒక కుక్క పిల్లను కొని బాలుడి ఆరోగ్య పరిస్థితిని, వైద్య వివరాలను పవన్ అడిగి తెలుసుకున్నారు. తన వ్యక్తిగత ఆదాయం నుండి వైద్య ఖర్చుల నిమిత్తం తక్షణ సహాయంగా రూ.1 లక్ష నగదును అందజేశారు. నిరంజన్ కుటుంబానికి శాశ్వత జీవనోపాధి కల్పించేందుకు ఒక క్యాంటీన్ ఏర్పాటు చేయాల్సిందిగా తెలంగాణ జనసేన నాయకులను పవన్ ఆదేశించారు. కాగా, పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ప్రముఖ నిర్మాత బండ్ల గణేష్ సైతం నిరంజన్ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. నిరంజన్‌కు తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందజేసిన పవన్.. ఒక ప్రత్యేకమైన ఆటోగ్రాఫ్ ఇస్తూ, దుర్గామాత ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

**భద్రకాళి అమ్మవారి దర్శనం -**

హనుమకొండలోని చారిత్రాత్మక భద్రకాళి అమ్మవారి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో పవన్ కళ్యాణ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిప్యూటీ సీఎం పర్యటన నేపథ్యంలో హనుమకొండలో అభిమానులు, జనసైనికులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఇటు నిరంజన్ ఇల్లు, అటు భద్రకాళి ఆలయ పరిసరాలు 'సీఎం.. సీఎం..' మరియు 'పవన్ కళ్యాణ్ జిందాబాద్' అనే నినాదాలతో మారుమోగాయి. ఆ తర్వాత స్థానిక రిసార్ట్‌లో ఏర్పాటు చేసిన లంచ్ ప్రోగ్రామ్‌లో పాల్గొని, జనసేన ముఖ్య నాయకులతో పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన నేరుగా విజయవాడకు తిరుగుపయనమయ్యారు.

# పారదర్శకంగా ఏజెన్సీల కేటాయింపు

- విపక్షాల చిల్లర రాతలను నమ్మొద్దు
- కొండా మురళి, సురేఖపై అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకోం
- కొండా అభిమానుల హెచ్చరిక

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ జిల్లాలో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల కేటాయింపుల విషయంలో సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులలో కొందరు కావాలనే చేస్తున్న తప్పుడు ప్రచారాలను కొండా అభిమానులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. పేద ప్రజల గుండె చప్పుడు తెలిసిన నాయకులు టైగర్ కొండా మురళి, మంత్రి కొండా సురేఖ అని, ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచే గుణం వారిదని కొండా అభిమానులు కొనియాడారు. ఇటీవలే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో దళారులు ఉన్నారనే విషయాన్ని గ్రహించిన కొండా మురళి తనదైన శైలిలో హెచ్చరించిన విషయాన్ని గుర్తుచేశారు. పేదల ఇళ్ల విషయంలో దళారులను నమ్మవద్దని, వసూలు చేసిన డబ్బును వెంటనే వెనక్కి ఇచ్చేయాలని ఆయన ఆదేశించడంతో కొందరు గుట్టుచప్పుడు కాకుండా, మరికొందరు బహిరంగంగానే డబ్బులు తిరిగి ఇచ్చేశారని తెలిపారు.

అంతటి నిబద్ధత కలిగిన కొండా దంపతుల నాయకత్వంలో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని ప్రచారం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కనీస అవగాహన లేకుండా, కోట్ల రూపాయల వసూళ్లు జరిగాయంటూ ఊహాగానాలతో రాసిన రాతల్లో ఎలాంటి నిజం లేదన్నారు. కనీసం లక్షల రూపాయల ఆదాయం కూడా రాని ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల కోసం యజమానులు కోట్ల రూపాయలు ఖర్చు పెడతారనడం అవివేకమని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని నిర్దిష్ట ఏజెన్సీలకే పదుల సంఖ్యలో శాఖలు, వందల సంఖ్యలో ఉద్యోగాలను అప్పగించి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నారని ఆరోపించారు. ఆనాటి నాయకులే ఈరోజు తప్పుడు రాతలు రాయించి, నిబద్ధతతో పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి, అధికారులకు మచ్చ తెచ్చేందుకు విఫలయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంతో కాలంగా పాతుకు




పోయిన పాత ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేసి, కొత్త వారికి అవకాశం కల్పించడం ద్వారా నియామకాల్లో, జీతాల చెల్లింపుల్లో పారదర్శకత పెరుగుతుందని నిరుద్యోగులు బలంగా విశ్వసిస్తున్నారని తెలిపారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో ఎలాంటి అవినీతికి తావు లేకుండా ఎంతో పారదర్శకంగా ప్రక్రియ జరుగుతోందని, ప్రతిపక్షాలు చేస్తున్న ఇటువంటి చిల్లర ప్రచారాలను తాము తిప్పికొడుతున్నామని కొండా అభిమానులు స్పష్టం చేశారు. ఇకనైనా ఇటువంటి విఫల ప్రయత్నాలు మానుకోవాలని వారు హెచ్చరించారు.

# ఆధ్యాత్మిక వైభవం

- కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణంలో కీలకఘట్టం
- శృంగేరి జగద్గురువుల ఆశీస్సులతో శాస్త్రోక్తంగా హోమాలు, శాంతి పూజలు
- బాలాలయంలో చిన్న లింగాలు, పంచలోహ కళశాల ప్రాణ ప్రతిష్ఠ నిర్వహణ
- వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ భక్తి పారవశ్యంలో మునిగిన పుణ్యక్షేత్రం



అక్షరదర్బార్, కాళేశ్వరం: ప్రపంచంలోనే అత్యంత అరుదైన పుణ్యక్షేత్రాలలో ఒకటిగా పేరుగాంచిన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానంలో చేపట్టిన పునర్నిర్మాణ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు, హోమాలు, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 5 గంటల నుంచే ఆలయ ప్రాంగణం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలతో మార్మోగింది.

దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్. మహేష్ ఆధ్వర్యంలో స్వామివారికి పూలు, పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శృంగేరి జగద్గురువుల ఆశీస్సులతో వచ్చిన శిష్యబృందం, తొమ్మిది మంది వేద పండితుల సమక్షంలో మహా గణపతి పూజతో కార్యక్రమాలను ప్రారంభించింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో పంచబ్రహ్మ హోమం, శాంతి పూజలు, ప్రాయశ్చిత్త హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమాలు ముగిసిన అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, మహామంగళహారతులు నిర్వహించారు.

ఆలయ ప్రాంగణంలోని విజయ గణపతి, పార్వతి (శుభానంద) మాత, మహా సరస్వతి మాత, సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించి, పంచలోహ కళశాలలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టారు. శృంగేరి పీఠాధిపతి జగద్గురు శ్రీ విధుశేఖర భారతీ మహాస్వామివారు ఆదిముక్తీశ్వర స్వామి ఆలయ ఆవరణంలో నిర్వహించనున్న బాలాలయ పూజల నిమిత్తం పంపించిన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారి చిన్న లింగాలకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బాజాభజంత్రులు, వేద మంత్రోచ్చారణల నడుమ కాళేశ్వరం ఆలయ ప్రధాన అర్చకులు నగేష్ శర్మ ఆధ్వర్యంలో కళశాలను తీసుకొని ఐదుగురు అర్చకులు ఆదిముక్తీశ్వర స్వామి ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాలాలయ మండపానికి చేరుకున్నారు. అక్కడ శృంగేరి పీఠ శిష్యబృందం ఆధ్వర్యంలో చిన్న లింగాలు, పంచలోహ కళశాలకు ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా భక్తి పారవశ్యంతో నిండిపోయింది.

**జయజయధ్వానాలు..**

పునర్నిర్మాణ కార్యక్రమాల్లో భాగంగా చేపట్టిన ఈ శాస్త్రోక్త కార్యక్రమాలు భవిష్యత్తులో చేపట్టనున్న ప్రధాన నిర్మాణ పనులకు మంగళప్రదంగా నిలుస్తాయని వేద పండితులు పేర్కొన్నారు. భక్తుల జయజయ ధ్వానాలు, మంగళ వాయిద్యాల నడుమ కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. అనంతరం శృంగేరి పీఠ శిష్యబృందం దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్ మహేష్, దేవస్థానం చైర్మన్ మోహన్ శర్మతో పాటు ధర్మకర్తలు సత్యనారాయణ, సీతయ్య, శ్యామ్, సీతారాం, దుర్గయ్య, అశోక్, పద్మ, రాజయ్య, ప్రశాంత్ రెడ్డి, శ్రీధర్ రావు, సత్యం తదితరులను సన్మానించి ఆశీర్వదించింది. వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, దేవస్థానం అధికారులు, సిబ్బంది, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

## మహిళల స్వావలంబనకు కుట్టుమిషన్ శిక్షణే ఆర్థిక భరోసా

- పలు గ్రామాల్లో శిక్షణా కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్సీ పోచంపల్లి, మాజీ ఎమ్మెల్యే చల్లా




అక్షరదర్బార్, పరకాల: గ్రామీణ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధి వైపు నడిపించేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో దోహద పడతాయని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పేర్కొన్నారు. పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరకాల నియోజకవర్గంలోని పలు గ్రామాలలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాలను వారు సందర్శించి పరిశీలించారు. నడికూడ మండలంలోని రామకృష్ణాపురం, ధర్మారం, పులిగిళ్ళ, వరికోల్ గ్రామాలతో పాటు పరకాల పట్టణం, వెల్లంపల్లి, అలియాబాద్, మల్లక్కపేట, నాగారం, పైడిపల్లి, వెంకటాపురం, హైబోత్‌పల్లి కేంద్రాలలో శిక్షణ పొందుతున్న మహిళలతో వారు ముచ్చటించారు. వారికి అందుతున్న సౌకర్యాలు, భవిష్యత్తు ఉపాధి అవకాశాలపై మహిళల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాకతీయ మెగా వస్త్ర పరిశ్రమలో పరకాల నియోజకవర్గ మహిళలకే తొలి ప్రాధాన్యం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, అందుకు అవసరమైన నైపుణ్యాలను ఈ శిక్షణ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బండి సారంగపాణి, చందుపట్ల సాయి తిరుపతి రెడ్డి, చంద కుమారస్వామి, కొక్కిరాల రాకేష్‌రావు పాల్గొన్నారు.

## తహసీల్దార్ విజయలక్ష్మి కుటుంబానికి కాంగ్రెస్ నేతల పరామర్శ

### దివంగత తోట లింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు

అక్షర దర్బార్, పరకాల: పరకాల తహసిల్దార్ తోట విజయలక్ష్మి తండ్రి, దివంగత తోట లింగం దశదినకర్మ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఖమ్మంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తోట లింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన పరకాల మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే నడికూడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పర్నం మల్లారెడ్డి, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ దాసరి బిక్షపతి, సమన్వయ కమిటీ సభ్యుడు, మున్సిపల్ కౌన్సిలర్ పోరండ్ల వేణు పాల్గొని దివంగత తోట లింగం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.






## లంచాలు తీసుకుంటే సస్పెన్షన్

- 'కోడ్'లు వాడితే కఠిన చర్యలు
- రవాణా శాఖలో అవినీతిపై విజిలెన్స్ జేటీసీ చంద్రశేఖర్ గౌడ్ కఠిన ఉత్తర్వులు


అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: రవాణా శాఖలో అవినీతికి పాల్పడినా, దళారులకు సహకరిస్తూ రహస్య కోడ్‌లు ఉపయోగించినా సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని రవాణా శాఖ విజిలెన్స్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎం. చంద్రశేఖర్ గౌడ్ హెచ్చరించారు. రవాణా కార్యాలయాలలో ఏజెంట్లు, సిబ్బంది వాడుతున్న సంకేతాలపై ముఖ్యమంత్రి కార్యాలయం ఆరా తీసిన నేపథ్యంలో ఆయన కీలక ఉత్తర్వులు జారీ చేశారు. ఏజెంట్ల ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించడంతో పాటు కార్యాలయంలోని ప్రతి సీసీ కెమెరా నిరంతరం పనిచేయాలని స్పష్టం చేశారు. కెమెరాలను నిలిపివేసినా లేదా ట్యాంపరింగ్ చేసినా అధికారులపై క్రమశిక్షణా చర్యలు ఉంటాయన్నారు. డ్రైవింగ్ టెస్ట్ దరఖాస్తుదారులు కచ్చితంగా ట్రాక్ వద్దకు హాజరుకావాలని, మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ అభ్యర్థి ఆధార్ కార్డు ద్వారా స్వయంగా గుర్తింపును ధృవీకరించాలని ఆదేశించారు. నామమాత్రంగా వాహనం నడిపిస్తే పరీక్ష పాస్ చేయడం కుదరదని, రివర్స్, లేన్ డిసిప్లిన్, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం వంటి అన్ని నైపుణ్యాలను పరిశీలించాలన్నారు. ఏసీబీ బృందాలు వస్తున్నాయని సిబ్బందిని అలర్ట్ చేయడానికి నంబర్ సీక్వెన్స్‌లు, సంకేతాలు వాడొద్దని, లంచాలు తీసుకుంటే విచారణ పెండింగ్‌లో ఉంచి తక్షణమే సస్పెండ్ చేస్తామని జేటీసీ చంద్రశేఖర్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రతీ నెలా 15వ తేదీ నాటికి కమిషనర్ కార్యాలయానికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

## ములుగు ఏజెన్సీలో సరికొత్త చరిత్ర

- తొలి ప్రైవేట్ ఐటీ కంపెనీ ప్రారంభం!
- గ్రామీణ యువతకు స్థానికంగానే ఐటీ ఉద్యోగాలు
- మంత్రి సీతక్క హర్షం

అక్షర దర్బార్, ములుగు: ములుగు మారుమూల ఏజెన్సీ జిల్లాలో తొలిసారిగా ప్రైవేట్ రంగంలో ఐటీ సంస్థ ఏర్పాటు కావడం శుభపరిణామమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రియా ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఐటీ రంగం కేవలం హైదరాబాద్ వంటి నగరాలకే పరిమితం కాకుండా ములుగు, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం వంటి వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతాలకు కూడా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు వికేంద్రీకరణ జరిగితేనే మారుమూల ప్రాంతాల గ్రామీణ యువతకు సమాన అవకాశాలు లభిస్తాయన్నారు. గత ఏడాది కాలంగా స్థానిక యువతకు యాప్ డెవలప్‌మెంట్ వంటి సాంకేతిక నైపుణ్యాలలో శిక్షణ ఇచ్చి, ప్రస్తుతం పదిహేను మందికి ఐటీ ఉద్యోగాలు కల్పించిన శ్రియా ఇన్ఫోటెక్ వ్యవస్థాపకుడు రవికుమార్ రంగారి ముందడుగును ఆమె అభినందించారు. ములుగులో పెట్టుబడులు పెట్టే ఐటీ కంపెనీలకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సహకారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ పాల్గొన్నారు.





# మొగుళ్లపల్లి మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా నీల రాజు

## ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎంపిక.. బలోపేతానికి సమష్టి కృషి

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ముల్కలపల్లి గ్రామ ఉప సర్పంచ్ నీల రాజు కురుమ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మండల పరిధిలోని వివిధ గ్రామాల ఉప సర్పంచ్‌లు మొగుళ్లపల్లి మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గట్టు ప్రదీప్ గౌడ్ హాజరై నూతన ఫోరంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా నేర్పటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బత్తిని శ్రీధర్, కోశాధికారిగా వంగ కోమల కుమార్, సలహాదారులుగా బోయిని కవిత అనిల్, గౌరవ అధ్యక్షులుగా వావిలాల నరేష్, ఎరబెల్లి హిమబిందు కోటేశ్వర్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గజ్జి కుమారస్వామి, కార్యదర్శిగా కొత్తూరి శంకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నీల రాజు కురుమ మాట్లాడుతూ.. మండలంలోని ఉప సర్పంచుల సమస్యల పరిష్కారం, గ్రామ పంచాయతీల బలోపేతం మరియు గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి చేస్తామన్నారు. గ్రామీణాభివృద్ధికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, ఉప సర్పంచుల హక్కులు మరియు బాధ్యతల పరిరక్షణకు ఫోరం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ఉప సర్పంచ్‌లు అచ్చ శ్రీనివాస్, తుమ్మ లక్ష్మి చిరంజీవి, బుర్ర సమ్మయ్య, తాళ్ల రమేష్, మాధం చైతన్య సురేష్, కాశిరెడ్డి అశోక్, ముత్యం రెడ్డి, విజేందర్ రెడ్డి, వేణుమాధవ్ పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థపై ఉక్కుపాదం


- జిల్లావ్యాప్తంగా పోలీసుల ఆకస్మిక తనిఖీలు!
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు: సీసీఎస్ సీఐ రమేష్

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు సీసీఎస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసులు, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం (ఎహెచ్‌టీయూ), వివిధ శాఖల అధికారులు కలిసి బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా పరిధిలో నిర్మాణంలో ఉన్న భవనాలు, ఇటుక బట్టీలు, రైస్ మిల్లులు, మెకానిక్ షాపులు, స్క్రాప్ షాపులు, బేకరీలలో విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రమేష్ మాట్లాడుతూ.. పద్దెనిమిది సంవత్సరాల లోపు పిల్లలను ఎలాంటి పనులలో పెట్టుకున్నా చట్టరీత్యా నేరమని, అలాంటి యాజమాన్యాలపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా బాల కార్మికులు ఉన్నట్లు సమాచారం తెలిస్తే ప్రజలు వెంటనే పది సున్నా తొమ్మిది ఎనిమిది (1098) టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ సహకరించి బాల కార్మిక నిర్మూలనకు తోడ్పడాలని సూచించారు.



# సీతారాంపురంలో వైభవంగా ముగిసిన గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాపన

## అమ్మవార్ల ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, చైర్మన్ సునీల్‌కుమార్



అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపురం గ్రామంలో మూడు రోజులుగా అత్యంత వైభవంగా సాగిన గ్రామదేవతల నూతన విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు వేడుకల్లో పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డిమరియు మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహోత్సవాలలో భాగంగా ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీలక్ష్మి, భూలక్ష్మి సహిత బొడ్రాయి, పోచమ్మ, దుర్గమ్మ, మైసమ్మ గ్రామదేవతలతో పాటు నాగేంద్ర, నవగ్రహాల విగ్రహాలకు వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయంలోని దేవతామూర్తులను దర్శించుకుని, నియోజకవర్గ ప్రజలపై అమ్మవార్ల కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సమన్వయ కమిటీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటరు జాబితా పారదర్శకతకు కట్టుదిట్టంగా పనిచేయాలి

## నర్సంపేట బీజేపీ కార్యశాలలో రాష్ట్ర సీనియర్ నేత చాడ శ్రీనివాస్ రెడ్డి దిశానిర్దేశం




అక్షర దర్బార్, నర్సంపేట: రాబోయే ఇంటింటి ఓటరు సర్వే ప్రక్రియలో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు చాడ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. బుధవారం బీజేపీ నర్సంపేట నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఓటరు జాబితా సవరణ కార్యశాలకు నియోజకవర్గ కన్వీనర్ రేసు శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, చాడ శ్రీనివాస్ రెడ్డి మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చాడ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన పవిత్రమైన ఓటు హక్కును కాపాడుకోవడం మన బాధ్యత అన్నారు. కొత్త ప్రక్రియ ద్వారా చనిపోయినవారు, ఇళ్లు మారినవారి పేర్లను తొలగించి, అర్హులైన ప్రతీ యువతీయువకుడిని ఓటరు జాబితాలో చేర్పించాలన్నారు. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. జూన్ ఇరవై ఐదు నుండి ప్రారంభమయ్యే ఇంటింటి సర్వేలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి బూత్ స్థాయి అధికారులతో (బీఎల్ఓ) సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, కౌన్సిలర్ జూలూరి రోజారాణి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నరసింహరాములు, కట్ల రామచంద్రా రెడ్డి, గడ్డం ఆంజనేయులు, కుంభం కోమల్ రెడ్డి, తడుక వినయ్, నెదురు రాజేందర్, తనుగుల అంబేద్కర్, నాయిని అనూష అశోక్ మరియు బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన జిల్లా వైద్యాధికారి డాక్టర్ రామ్‌కుమార్‌కు టీఎన్‌జీఓల అభినందనలు

## జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వక భేటీ

అక్షర దర్బార్, హనుమకొండ: హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రామ్‌కుమార్‌ను టీఎన్‌జీఓ యూనియన్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, టీఎన్‌జీఓ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతల్లో వైద్యాధికారి విజయవంతం కావాలని కోరుతూ ఉద్యోగ సంఘాల తరఫున పూర్తి సంఘీభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, ఉపాధ్యక్షులు రాజేశ్వర్‌రెడ్డి, రాజేష్ కన్నా, రాజీవ్, పైడి రాజు, అశోక్, వెంకన్న, రాజు, మహబూబ్, సిద్ధార్థ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.




# విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దురుసు ప్రవర్తన

- మద్యం మత్తులో ఉన్న వ్యక్తిపై కేసు నమోదు!
- మెట్టుపల్లి గ్రామంలో ప్రభుత్వ విధులకు ఆటంకం
- ఎస్సై ముప్పు సురేష్

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి క్రైమ్: మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మెట్టుపల్లి గ్రామంలో విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించి, ప్రభుత్వ విధులకు తీవ్ర ఆటంకం కలిగించిన ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. జూన్ పదహారున రాత్రి సమయంలో మెట్టుపల్లి గ్రామంలో జరిగిన ఒక గొడవ సమాచారంపై బ్లూ కోల్ట్ విధుల్లో భాగంగా మొగుళ్లపల్లి పోలీస్ కానిస్టేబుళ్లు అక్కడికి వెళ్లారు. ఆ సమయంలో మామునూరి రాజేష్ అనే వ్యక్తి మద్యం మత్తులో గ్రామంలో తీవ్రంగా గొడవ చేస్తూ, న్యూసెన్స్ సృష్టిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గొడవను ఆపడానికి ప్రయత్నించిన పోలీసు సిబ్బందిపై సదరు వ్యక్తి దురుసుగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించినందుకు అతనిపై చట్టపరంగా కేసు నమోదు చేసినట్లు మొగుళ్లపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ ముప్పు సురేష్ వెల్లడించారు.

